జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త
తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి వెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

శుక్రవారం | 19-07-2024 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 76 పేజీలు: 8 వెల : రూ.7

# ఏడాదిలోగా.. స్టేడియం నిర్మాణం

* శ్రీకాకుళం- ఆమదాలవలస రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తాం
* మూలపేటలో మినీ ఎయిర్పోర్ట్
* వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



**శ్రీకాకుళం, జులై 18(వార్త):** ఏడాది లోపే కేఆర్ స్టేడియం నిర్మాణం పూర్తి చేసి క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకువస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. పక్కా ప్రణాళికతో జిల్లా అభివృద్ధికి బాటలు వేస్తున్నా మన్నారు. జిల్లాలోని గ్రామాలన్నింటినీ ఐదేళ్ల వ్యవధి లో అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి స్వయం సమృద్ధిని సాధించే లక్ష్యంగా ముందు కెళ్తున్నామని తెలిపారు. జిల్లా కేంద్రంలోని కోడి రామ్మూర్తి స్టేడియం పునః నిర్మాణ పనులను ఆయన స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి గురువారం లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ స్వప్నిల్ దినకర్‌తో కలిసి ఆర్అండ్‌బి, క్రీడా శాఖ, కాంట్రాక్టర్లతో సమీక్ష నిర్వహించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో ఏళ్ల తరబడి రెండు ప్రధాన సమస్యలు పరిష్కరిస్తామన్నారు. స్టేడియం పూర్తి చేసేందుకు కాంట్రాక్టర్‌కి రెండేళ్ల సమయం ఉన్నప్పటికీ తొమ్మిది నెలల్లో పూర్తి చేయాలని కోరామన్నారు. శ్రీకాకుళం – ఆమదాలవలస రహదారికి అత్యవసరంగా రూ.కోటి నిధులు ఇచ్చామని కొత్త రోడ్డు జంక్షన్ నుంచి వాకలవలస వరకూ యుద్ధ ప్రాతిపదికన పనులు చేపడతామన్నారు. గత ఐదేళ్లలో వంశధార నుంచి చుక్క నీరు పలాస, వజ్రపు కొత్తూరులకు ఇవ్వలేక పోయారని, సిఎం చంద్రబాబు సారథ్యంలో మేము వచ్చీ రాగానే రూ.90 లక్షలతో 1.70 లక్షల ఎకరాలకు నీరివ్వడం ఎంతో తృప్తినిచ్చిందని చెప్పారు. తొమ్మిది శాఖలు నిర్వహిస్తున్న మంత్రిగా జిల్లా అభివృద్ధిని పరుగులు పెట్టిస్తానని, మూలపేట పోర్టు పూర్తి చేసి, అక్కడే మినీ ఎయిర్పోర్ట్ నిర్మిస్తామని అన్నారు. ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు, కొత్త గిడ్డంగులు నిర్మిస్తామని, మూలపేటలో రైతులు, జిల్లాలోని మత్స్యకారుల సమస్యలు పరిష్కరించి, వలసలు నివారిస్తామని వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చల్లా ఓబులేసు, ఆర్ అండ్ బి ఎస్ఈ జాన్ సుధాకర్, డిఎస్డిఓ బి.శ్రీధర్, వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు.



**రాష్ట్రంలో ఆదర్శ ఆసుపత్రిగా తీర్చి దిద్దాలి**

ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని మంత్రి కింజరాపు అచ్చన్నాయుడు ఆదేశించారు. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, స్థానిక శాసన సభ్యులు గొండు శంకర్ లతో కలసి గురువారం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రి వాతావరణం మారాలని, అందుకు అవసరమైన నిధులు తీసుకువస్తామన్నారు. ఆసుపత్రిలో లిఫ్ట్ లేక పోతే పేషెంట్లను ఎలా తీసుకు వస్తారన్నారు. ఆసుపత్రిలో 15 లక్షల రూపాయల నిధులు అందుబాటులో ఉన్నప్పటికీ లిఫ్ట్ బాగు చేయలేదన్నారు. అందులో నిధులతో తక్షణమే లిఫ్ట్ బాగు చేయించేందుకు చర్యలు తీసుకోవాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ షకీలాను ఆదేశించారు. రాష్ట్రంలో ఆదర్శ ఆసుపత్రిగా తీర్చి దిద్దడానికి అందరూ కలిసి కట్టుగా పని చేయాలన్నారు. 71 ఖాళీలు ఉన్నాయని సూపరింటెండెంట్ చెప్పగా ఏ ఏ విభాగంలో ఖాళీలు ఉన్నాయో జిల్లా కలెక్టర్‌తో చర్చించి జాబితా తయారు చేసి ప్రభుత్వానికి పంపాలని ఆదేశించారు. కేడర్ స్ట్రెంక్త్ లో ఎన్ని ఖాళీలు ఉన్నాయని మంత్రి అడుగగా 231 పోస్టులు ఖాళీగా ఉన్నట్టు చెప్పారు. ఉన్న పోస్టులకు అదనంగా ఉన్న పోస్టులకు జీత భత్యాలు ఎవరిస్తారని అడుగగా ఆప్కాబ్ నుండి వస్తున్నట్లు వివరించారు. సెక్యూరిటీకి జీతాలు ఇస్తున్నారా లేదా అని అడుగగా 5 నెలల నుండి వేతనాలు అందలేదని చెప్పగా కాంట్రాక్టర్‌ను తనను కలవమని ఆదేశించారు. ఓపి వద్ద వచ్చే పేషెంట్స్‌కు కూర్చోడానికి ఫ్యాన్లు, చైర్స్ ఉండాలని, అందుకు డోనర్స్ నుండి సేకరించాలని మంత్రి సూచించారు. ఆసుపత్రిలోని సమస్యలను వైద్యాధికారుల నుంచి అడిగి తెలుసుకున్నారు.

## కురిసింది.. వాన

* ఉదయం నుంచి వాన
* పొలం పనుల్లో రైతులు నిమగ్నం
* కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం

**శ్రీకాకుళం టౌన్, జులై18 (వార్త):** జిల్లావ్యాప్తంగా గురువారం ఉదయం నుంచి వర్షం కురుస్తోంది. నీరు చేరడంతో రైతులు పొలం పనుల్లో నిమగ్నమయ్యారు. వర్షాలు కోసం రైతులు ఆలయాల్లో అభిషేకాలు చేసిన విషయం తెలిసిందే. ఎట్టకేలకు వర్షం కురియడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రెండు మూడు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూంను ఏర్పాటు చేశారు. కంట్రోల్ రూంలో ఫోన్ నంబర్ 08942-240557, (డిజాస్టర్ మేనేజ్ మెంట్) డిపిఎం ఫోన్ నంబర్ 7794082017 ఏర్పాటు చేశామన్నారు. అలాగే మండల, డివిజన్ స్థాయిలో కంట్రోల్ రూంలను ఏర్పాటు చేయవలసినదిగా ఆదేవించారు. క్షేత్రస్థాయిలో తహసీల్దార్లు, ఎంపిడిఓలు, మున్సిపల్ కమీషనర్లు, జిల్లా పంచాయతీ అధికారి, విద్యుత్ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని, గంటకు 50 కిలోమీటర్లు వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు.



## వీర జవాన్ రాజేష్‌కు.. కన్నీటి వీడ్కోలు



* భారీ ర్యాలీగా భౌతికకాయాన్ని తీసుకెళ్లిన యువకులు
* జోరువానలో ప్రభుత్వ అధికార లాంఛనాలతో అంత్యక్రియలు
* హాజరైన మంత్రి అచ్చెన్న, జిల్లా కలెక్టర్, ఎస్పీ

**సంతబొమ్మాళి, జులై 18 (వార్త):** జమ్ము కాశ్మీర్‌లోని ధోడా జిల్లాలో ఉగ్రవాదులు, భద్రతా బలగాలకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో అమరుడైన వీర జవాన్ డొక్కరి రాజేష్‌కు స్వగ్రామం చెట్లతాండ్రలో అశేష జనసందోహం నడుమ కన్నీటి వీడ్కోలు పలికారు. రాజేష్ భౌతిక కాయాన్ని జమ్మూ కాశ్మీర్ నుంచి విశాఖపట్నంకు, అక్కడి నుంచి చెట్లతాండ్రకు రోడ్డు మార్గాన తీసుకువచ్చారు. రాజేష్ పార్థివదేహాన్ని గ్రామాల్లో ఊరేగించారు. రాజేష్ అమర్ రహే అంటూ జాతీయ జెండాను ఎగరవేస్తూ గ్రామానికి తీసుకువెళ్లి ఆ కుటుంబానికి అండగా నిలిచారు. పార్థివ దేహాన్ని చూసి తల్లిదండ్రులు, సోదరులు సభ్యులు కన్నీటిమున్నీరయ్యారు. అధికార లాంఛనాలతో రాజేష్‌కు అంత్యక్రియలు నిర్వహించారు. పోలీసులు మూడు రౌండ్లు గాలిలో కాల్పులు జరిపి నివాళులు అర్పించారు. అంత్యక్రియలకు వేలాదిమంది అభిమానులు, చుట్టుపక్కల గ్రామస్తులు, రిటైర్డ్ ఆర్మీ జవాన్లు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి, టెక్కలి సబ్ కలెక్టర్ నూరల్ కమర్‌లు రాజేష్ అంతిమ యాత్రలో పాల్గొని నివాళులు అర్పించారు.



కుటుంబ



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## 21న మందసలో గురుపూర్ణిమ వేడుకలు

**మందస, జులై 18 (వార్త):** మేజరు పంచాయతీ మందస పట్టణంలో ఈ నెల 21న గురుపూర్ణిమ వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్టు శ్రీషిరిడిసాయి ధ్యానమందిరంవ్యవస్థాపక అధ్యక్షుడు గిన్ని తిరుపతిరెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు కొమ్మాజోస్యుల సీతారామశర్మ చెప్పారు. గురుపూర్ణిమ మహోత్సవంతో పాటు ఆలయ 25వ వార్షికోత్సవం సందర్భంగా ఉదయం 5.15 గంటలకు అఖండజ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయని, 5.30 గంటల నుండి 8 గంటల వరకు భక్తులచే క్షీరాభిషేకం అనంతరం పంచామృతాది గంధ విభూధి సహిత సుగంధ ద్రవ్యములతో సాయినాధునికి మంగళ స్నానములతో అభిషేకం జరుగుతుందన్నారు. అభిషేకం, అష్టోత్తర అర్చన అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుని వార్షికోత్సవ మహోత్సవంతో పాటు లీలామానుషరూపధారి, సర్వరోగనివారి, నిరాడంబర జీవిత సంచారి, సద్గురు సాయినాధుని తిరువీధుల ప్రదక్షణ మేళతాళాలు, కోలాట నృత్యాలు, హరేరామ, హరేకృష్ణ భజనలతో అంగరంగ వైభవంగా జరుగుతుందన్నారు. మహత్తర కార్యక్రమంలో పాల్గొనాలన్నారు.

# అవును.. ఇది సాగునీటి కాలువే!

*** వ్యర్థాలతో పూడుకుపోయిన కాలువ * వర్షం పడితే రోడ్డుపైకి మురుగునీరు * రూపు కోల్పోయిన హడ్డుబంగి కాలువ * పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు**





**కొత్తూరు, జులై18 (వార్త):** కొత్తూరు మండలంలోని హడ్డుబంగి గెడ్డ కాలువ చెత్తతో నిండిపోయింది. మండల కేంద్రంలోని కొత్తూరు పట్టణానికి ఆనుకుని ఉన్న నివగాం ప్రధాన రహదారి పక్కనుండి వెళ్లే హడ్డుబంగి గెడ్డ ద్వారా కొత్తూరు, మహర్తపురం, కుంటిభద్ర తదితర గ్రామాలకు సుమారు 1500 ఎకరాలకు సాగునీరు అందిస్తుంది. ఈ సాగునీటి గెడ్డకు ఆనుకొని ఉన్న పలు దుకాణాలు, హొటళ్లు, చికెన్ సెంటర్లు, నివాస గృహాలు ఉన్నాయి. వారంతా చెత్తను ఈ కాలువలో పడబోస్తున్నారు. దీంతో ఈ కాలువ పూడుపోయింది. దీన్ని చూస్తే ఇది కాలువలా అనిపించడం లేదు. పూర్తిగా రూపురేఖలు మారిపోయి గుర్తుపట్టలేని విధంగా మారింది. అలాగే కర్లెమ్మ గెడ్డ నుంచి నేతాజీ నగర్ కాలనీ వెనుక భాగంలో ఉన్న ఇదే హడ్డుబంగి గెడ్డ కూడా నిర్లక్ష్యానికి గురైంది. ఈ కాలువకు ఉన& సప్టాలు చాలా కాలం క్రితం కొట్టుకుపోయాయి. ఈ కాలువ ద్వారా అందే సాగునీరు వృధాగా పోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హడ్డుబంగి గెడ్డ దుస్థితిపై పలుమార్తు కథనాలు వచ్చినా సాగునీటి పారుదల శాఖ ఇంజినీరింగ్ అధికారుల్లో కనీస చలనం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు స్పందించి ఈ కాలువలో పూడికలు తొలగించి ఆయకట్టుకు సాగునీరు అందేలా చూడాలని రైతులు కోరుతున్నారు.




## స్మశానవాటికలో జారిపడి మృతి



**మెళియాపుట్టి, జులై18(వార్త):** జాడుపల్లి గ్రామానికి చెందిన అదపాకల శ్రీధర్ (50) బుధవారం మధ్యాహ్న సమయంలో మెళియాపుట్టి మండల కేంద్రం సమీపాన ఉన్న మహేంద్ర తనయ నది వద్ద ఉన్న స్మశాన వాటిక గట్టుపై కూర్చొని ఒక్కసారిగా వెనుకకు జారిపడి మృతి చెందాడని ఎస్ఐ రాజేష్ తెలిపారు. మృతుడి భార్య సుగుణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## సందీప్ కుటుంబానికి జనసేన సాయం



**వజ్రపుకొత్తూరు, జులై18(వార్త):** గునుపల్లికి చెందిన జనసేన కార్యకర్త చొక్కార సందీప్(35) గుండెపోటుతో మృతి చెందాడు. మండల జనసేన నాయకులు మృతుడు చొక్కర సందీప్ కుటుంబానికి గురువారం రూ.50వేలు ఆర్థికసాయం చేశారు. కార్యక్రమంలో జనసేన కార్యకర్తలు గండుపల్లి ఈశ్వరరావు, కొమర ఈశ్వరరావు, టెంక తేజ, గీత గణపతి, కంబాల రాజు, మదనాల చిన్నారావు పాల్గొన్నారు.

## వాన పడితే.. ముంపులో సూరాడ వీధి



**వజ్రపుకొత్తూరు, జులై18(వార్త):** వర్షం పడితే చాలు హుకుంపేట గ్రామంలోగల సూరాడవీధి ముంపునకు గురవుతోంది. వీధిలో మోకాలు లోతులో నీరు నిల్వ ఉండిపోతుంది. వీధిలో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో దిగువకు నీరు వెళ్లే అవకాశం లేకుండా పోతోంది. వర్షం నీరు నిల్వ ఉండడం వల్ల దోమలు వృద్ధి చెందుతున్నాయని వీధివాసులు ఆవేదన చెందుతున్నారు. అధికారులు స్పందించి సూరాడవీధిలో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

## కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించండి



**నరసన్నపేట/జలుమూరు, జులై 18 (వార్త):** గ్రామాలలో కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించడంతో పాటు వారికి ఉచితంగా మందులు పంపిణీ చేయాలని డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ వాన సురేశ్ ఆదేశించారు. నరసన్నపేట మండలం మడపాం సచివాలయంలో గురువారం ఆరోగ్య సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బృందాలుగా ఏర్పడి ప్రతిరోజు 25 కుటుంబాలను పరీక్షించాలన్నారు. వ్యాధి లక్షణాలు ఉన్నట్లయితే సమాచారం ఇవ్వాలన్నారు.


## ఏఐకేఎంఎస్ రాష్ట్ర జనరల్ కౌన్సిల్‌ను జయప్రదం చేయండి



**మందస, జులై18(వార్త):** అఖిలభారత రైతు కూలీ సంఘం (ఏఐకే ఎంఎస్) రాష్ట్ర జనరల్ కౌన్సిల్ విజయవంతం చేయాలని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు మామిడి భీమారావు పిలుపునిచ్చారు. మందస మండలంలోని ఉద్దాన ప్రాంతమైన రట్టి గ్రామంలో కరపత్రాలను ఆవిష్కరించారు. జులై 20న కర్నూలులో ఈ జనరల్ కౌన్సిల్ జరగనుందని, రైతు కూలీలు హాజరై విజయవంతం చేయాలన్నారు. దేశానికి అన్నం పెట్టే రైతన్న నేడు అప్పులు ఊబిలోకూరుకుపోయి ఉన్నాడని, రైతులను ప్రభుత్వాలు ఆదుకోవడంలో విఫలమయ్యాయని అన్నారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమవుతున్నందున రైతులకు కావలసిన ఎరువులను సబ్సిడీపై ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతాంగ రుణాలను మాఫీ చేయాలని, కౌలు రైతులకు రుణాలు మంజూరు చేయాలన్నారు. వంశధార నీటిని ఇచ్ఛాపురం వరకు వచ్చేటట్లు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నారాయణ, గురయ్య, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు పరామర్శ

**గార, జులై 18 (వార్త):** కొత్తూరు సవిరిగాం గ్రామంలో సనపల వైకుంఠరావు, సతివాడ గ్రామంలో సల్ల చిన్నమ్మడు, కె.మత్స్యలేసం గ్రామంలో పప్పు రాజారత్నం ఇటీవల మృతి చెందారు. ఆయా కుటుంబాలను ఎమ్మెల్యే సతీమణి, శ్రీకాకుళం నియోజకవర్గం తెలుగు మహిళా అధ్యక్షురాలు గొండు స్వాతీ శంకర్ గురువారం పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆమె వెంట టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.





## చెత్తను కుండీల్లోనే వేయండి

**నరసన్నపేట/జలుమూరు, జులై 18 (వార్త):** కూరగాయల దుకాణాల నిర్వాహకులు చెత్తను రోడ్డుపైన పడవేయకుండా కుండీల్లోనే వేయాలని మేజర్ పంచాయతీ సర్పంచ్ బూరల్లి శంకర్ సూచించారు. కూరగాయల వ్యర్థాలను రోడ్డు పక్కన వేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గురువారం మార్కెట్, కాలేజీ రోడ్డులో ఉన్న కూరగాయల దుకాణాలను పరిశీలించారు. వ్యర్థాలను చెత్తకుండీల్లో వేయడం వల్ల పంచాయతీ పారిశుధ్య కార్మికులు వాటిని డంపింగ్ యార్డుకు తరలిస్తారన్నారు. అదే రోడ్డుపై వేయడం వల్ల అవి కుళ్లిపోయి కంపుకొడతాయని, దోమలు ఎక్కువ సంఖ్యలో వ్యాపించి డెంగ్యూ, మలేరియా వంటి జ్వరాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. మార్కెట్‌ను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. అనంతరం రాజుల చెరువు ప్రాంతంలో దుకాణాల వద్ద ఉన్న చెత్తను పారిశుధ్య కార్మికులతో తీయించారు.

## యాంత్రీకరణపై దృష్టి సారించండి



**పోలాకి/జలుమూరు, జులై18 (వార్త):** రైతులు వ్యవసాయ యాంత్రీకరణపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మబగాం గ్రామంలో తన వ్యవసాయ క్షేత్రంలో ఉడుపు యంత్రంతో గురువారం వరి నాట్లు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో రైతులంతా అధునాతన వ్యవసాయంపై అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రస్తుతం కూలీల కొరత అధికంగా ఉన్నందున దీన్ని అధిగమించేందుకు వ్యవసాయం యాంత్రీకరణ దోహదపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో మండల అగ్రికల్చర్ ఆఫీసర్ పి.చిరంజీవి, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ రోజా రత్నం, ఉడుపు యంత్రం ఆపరేటర్ సన్యాసప్పలనాయుడు, రైతులు పాల్గొన్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## దర్గా అధ్యక్షుడిగా అబ్దుల్లా పదవీకాలం పొడిగింపు

**ఇచ్ఛాపురం, జులై 18 (వార్త):** స్థానిక హాజరత్ యుషాఫ్ షా టకీయా (లాలాపేట దర్గా) అధ్యక్షుడిగా ప్రస్తుత అధ్యక్షుడు మాజీ కో ఆప్షన్ సభ్యుడు హెచ్ఎమ్ అబ్దుల్లా కొనసాగుతున్నట్లు వక్ఫ్ బోర్డ్ ఇన్స్పెక్టర్ ఆడిటర్ అబ్దుల్ సాదిక్ షేక్ చెప్పారు. గురువారం రియాజఖాన్‌తో కలిసి దర్గాను సందర్శించారు. ఈ ఏడాది జూన్26 తో పదవీకాలం ముగిసింది. ఈ విషయమై హైకోర్టు స్టే ఇచ్చినందున ప్రస్తుతం ఉన్న మేనేజ్మెంట్ కమిటీ ప్రెసిడెంటషిప్‌లో రాష్ట్ర వక్ఫ్ బోర్డు కొత్త కమిటీని నియమించేవరకు కొనసాగించాలని తెలిపారు.






## మీ త్యాగం.. అజరామరం

**మందస, జులై 18 (వార్త):** మీత్యాగం అజరామరం.. మీ దేశభక్తి అపురూపం.. భరతమాత సేవలో నేలతల్లిని ముద్దాడి.. వీరమరణం పొందిన మీరు ధన్యజీవులంటూ.. మందస ఎంపీడీఓ అరసాడ రఘుపతిరావు అన్నారు. మందస పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో దేశసేవలో అసువులు బాసిన వీర జవాన్లకు నివాళులు అర్పించారు. నందిగాం మండలంలోని వల్లభరాయుడుపేట గ్రామానికి చెందిన సనపల జగదీశ్వరరావు, సంతబొమ్మాళి మండలంలోని చెట్లతాండ్ర గ్రామానికి చెందిన డొక్కరి రాజేశ్ భారత సైన్యంలో పని చేస్తున్నారు. వీరిద్దరూ వేర్వేరు ఘటనల్లో ముష్కరుల దాడిలో వీరమరణం పొందారు. అమరులైన జగదీశ్వరరావు, రాజేశ్ ఆత్మకు శాంతి కలగాలని రెండు నిముషాలు మౌనం పాటించారు. అమర్ రహే జగదీశ్, రాజేశ్ అంటూ నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఏఓ బూరగాన ఋష్యేశ్వరరావు, పంచాయతీ రాజ్ గత విస్తరణాధికారి కె.జయప్రకాశ్, జూనియర్ అసిస్టెంట్ హనుమంతు సురేశ్, బైపల్లి మోహనరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీముఖలింగేశ్వరుని గ్రామోత్సవం

**జలుమూరు, జులై 18 (వార్త):** శ్రీముఖలింగంలో బుధవారం రాత్రి తొలి ఏకాదశి సందర్భంగా గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అర్చకులు ఆలయ ధర్మకర్త పర్లాకిముండి మహారాజా పేరున ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. రాత్రి నిర్వహించిన తిరువీధిలో ఆలయ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

## హెల్మెట్ వినియోగంపై అవగాహనకు.. వన్ కే వాక్ ర్యాలీ




**ఇచ్ఛాపురం, జులై18 (వార్త):** మండల లీగల్ సర్వీసెస్ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి పరిష్ కుమార్ ఆధ్వర్యంలో హెల్మెట్ వినియోగంపై వన్ కె ర్యాలీని గురువారం నిర్వహించారు. హెల్మెట్ ఉపయోగించడం ద్వారా కలిగే ఉపయోగాలను, హెల్మెట్ ఉపయోగించకపోవడం వల్ల కలిగే నష్టాలను గూర్చి ఈ ర్యాలీలో వివరించారు. వాహనాదారులందరూ హెల్మెట్ ధరించడం వల్ల వారికే కాకుండా వారి కుటుంబానికి కూడా రక్షించగలిగే వారిలా ఉంటారని, అందరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనాన్ని నడపాలని తెలిపారు. ప్రతి ఒక్కరికి వారి జీవితం ఎంతో విలువైనదని, ప్రమాదాల నుంచి ముఖ్యంగా రోడ్డు ప్రమాదాల నుంచి తప్పించుకోవడానికి హెల్మెట్ అనేది ఒక ఆయుధంలా పని చేస్తుందని అన్నారు. ర్యాలీలో నాగరాజ్ పాత్రో, భగవాన్ దాస్, లక్ష్మీనారాయణ, సూర్యనారాయణ, జగ్గారావు, ప్రహల్లాద రెడ్డి, వేణు, రాంబాబు, దేవరాజు రెడ్డి, ప్రసాదు, న్యాయవాది రాంబాబు, శాంతినికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు, డిగ్రీ కాలేజ్, ఆదిత్య డిగ్రీ కాలేజ్ విద్యార్థులు పాల్గొన్నారు. కోర్టు నుంచి దాసన్నపేట జంక్షన్ వరకూ ర్యాలీ నిర్వహించారు.

## ఆక్రమణపై కదిలిన రెవెన్యూ యంత్రాంగం

**కొత్తూరు/పాతపట్నం, జులై 18 (వార్త):** పాతపట్నం మేజర్ పంచాయతీలో ఉన్న నరిసింగ్‌నగర్‌కి ఆనుకునివున్న సర్వే నెంబర్ 16(1)లో 5.02 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న విలువైన ఎర్ర చెరువులో సుమారు 2 ఎకరాలు వరకు ఆక్రమణలు జరిగాయని స్థానికులు పాతపట్నం శాసనసభ్యులు మామిడి గోవిందరావు దృష్టికి గత కొద్దిరోజుల క్రితం తీసుకువచ్చారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే సర్వే చేసి ఆక్రమణలు తొలగించాలని రెవెన్యూ అధికారులకు ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశాలతో గురువారం రెవెన్యూ అధికారులు సర్వే చేశారు. ఇక్కడ పట్టణ ప్రజల సౌకర్యార్థం వాకింగ్ చేసేందుకు వీలుగా ఈ ఎర్రచెరువును పార్క్‌గా తయారు చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సర్వేలో మండల సర్వేయర్ రామగణపతి, సచివాలయ సర్వేయర్లు అనిల్, షణ్ముఖ, ఆర్ఐ భువన్, వీఆర్వో పార్ధసారధి, గ్రామస్థులు పాల్గొన్నారు.



# చురుగ్గా జనసేన సభ్యత్వ నమోదు

**నరసన్నపేట/జలుమూరు, జులై18 (వార్త):** నరసన్నపేట జనసేన కేంద్ర కార్యాలయంలో ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ బలగ ప్రవీణ్ కుమార్ క్రియాశీలక సభ్యత్వ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు పాల్గొన్నారు.



### ప్రారంభమైన సభ్యత్వ నమోదు



**మెళియాపుట్టి, జులై 18 (వార్త):** జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత నమోదు కార్యక్రమాన్ని మెళియాపుట్టి మండల కేంద్రంలో గురువారం ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రారంభించారు. ఈ ప్రక్రియలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆ పార్టీ నాయకుడు దుక్క బాలరాజు కోరారు. ప్రతి ఒక్క జన సైనికులు, వీరమహిళలు సభ్యత్వాలు చేయించాలన్నారు. గతంలో చేసుకున్న వారు రెన్యువల్ చేసుకోవాలని తెలిపారు. రూ.500 చెల్లించి సభ్యత్వ నమోదు చేసుకోవడం వల్ల భవిష్యత్‌తో ప్రమాదవశాత్తు గాయపడి హాస్పిటల్లో చేరితే అట్టి వారికి 50 వేల రూపాయలు, మరణిస్తే వారి కుటుంబానికి 5 లక్షల రూపాయలు బీమాను జనసేన పార్టీ అధిష్టానం అందిస్తుందని తెలిపారు. ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో బాలరాజుతోపాటు సవలాపురం చంటి, చింతల ప్రశాంత్, బురగాన సత్యనారాయణ, సురేష్ తదితరులున్నారు.

### సభ్యత్వ నమోదులో ముందుండాలి

**ఇచ్ఛాపురం, జులై 18 (వార్త):** జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ప్రజా పోరాట యాత్ర ప్రారంభించిన స్ఫూర్తితో గురువారం ముచ్చంద్ర గ్రామంలో నాలుగో విడత క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం ఆ పార్టీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ తిప్పన దుర్యోధన రెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభించారు. గత మూడు విడతల్లో చేసిన సభ్యత్వాలులో బెన్నిగానిపేట, కేదారిపురం గ్రామంలో క్రియాశీలక సభ్యత్వాలు నమోదు అయ్యాయని, అదే విధంగా ఈసారి కూడా క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ముందు వరుసలో నిలవాలని కోరారు. కార్యక్రమంలో సాడి శంకర్ రెడ్డి, పొన్నగంట గణేష్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రజలకు అందుబాటులో ఉండాలి

* పారిశుధ్యంపై అధికారులు దృష్టి సారించండి
* శాఖల వారీగా ప్రణాళికలు సిద్ధం చేయాలి
* పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు
* మండల పరిషత్ సర్వసభ్య సమావేశం



**ఎల్ఎన్‌పేట, జులై 18(వార్త):** మండల స్థాయి అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూప్రజా సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించేలా కృషిచేయాలని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమాశంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని అధికారులను ఉద్దేశించి మాట్లాడారు. అధికారులు, ప్రజా ప్రతినిధులతో చర్చించి రాజకీయాలకు అతీతంగా కలసి కట్టుగా పనిచేసి గ్రామాల అభివృద్ధికి కృషిచేయాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన పనులపై శాఖల వారీగా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. అలాగే గిరిజన గ్రామాల్లో మౌలిక వసతులు, పారిశుధ్యంపై దృష్టి సారించాలన్నారు. ఆర్అండ్‌బీ, పంచాయితీరాజ్ రహదారుల నిర్మాణ పనుల మరమ్మతులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఇక నుంచి నిర్వహించే సమావేశాలకు మండల స్థాయి అధికారులంతా హాజరుకావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రెడ్డి జ్యోతిలక్ష్మి, జడ్పీటీసి కిలారి త్రినాధులు, ఎంపీడీవో గిరిబాల, మండల స్థాయి అధికారులు, సర్పంచ్లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

# నాడు నేడు పనుల్లో నాణ్యతా లోపం

* అరకొర నిధులతో అసంపూర్తి పనులు * ఎమ్మెల్యే చొరవతో అభివృద్ధికి శ్రీకారం * జడ్పీటీసీ బుచ్చిబాబు



**హిరమండలం, జులై 18(వార్త):** గత ప్రభుత్వ హయాంలో నాడునేడు పనుల్లో భాగంగా పాఠశాలలకు అందజేయాల్సిన నిధులు విడుదల చేయకపోవటంతో పలు పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయని జెడ్పీటీసి పొగిరి బుచ్చిబాబు అన్నారు. గురువారం తంప జెడ్పీఉన్నత పాఠశాలను సందర్శించారు. అసంపూర్తిగా నిలిచిపోయిన తరగతి గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో నాడు నేడు 2వ విడత పథకంలో భాగంగా నిధులు మంజూరు చేయకపోవటంపై ఉన్న సౌకర్యాలు కోల్పోయి కొత్త సమస్యలు ఉత్పన్నమయ్యాయన్నారు. కొండ నాలుకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడిపోయిన చందంగా పాఠశాలల తరగతి గదులు మారాయన్నారు. తరగతి గదుల్లో ఫర్నిచర్ లేక విద్యార్థులు నేల మీద కూర్చుని విద్యనభ్యసించటం బాధాకరమన్నారు. పాఠశాల ఆవరణలో పారిశుద్ధ్య లోపం తాండవిస్తుందని, మధ్యాహ్న భోజన పథకంలో అమలు అవుతున్న తీరులో లోపాలు ఉన్నాయన్నారు. పాఠశాలకు వెళ్లే రహదారితో పాటు డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేకపోవటం వల్ల విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారన్నారు. పాఠశాల అభివృద్ధి విషయంపై ఎంఎల్ఏ మామిడి గోవిందరావు దృష్టికి తీసుకువెళతామన్నారు. విద్యార్థులతో కలసి మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. ఆయన వెంట ధనుపురం సర్పంచ్ దారపు ఢిల్లేశ్వరరావు ఉన్నారు.

## విద్యార్థుల వివరాలు యూడైస్‌లో నమోదు చేయాలి

### మండల విద్యాశాఖాధికారి కె.రాంబాబు

**హిరమండలం, జులై18(వార్త):** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల వివరాలు యూడైస్ పోర్టల్‌లో నమోదు చేయాలని మండల విద్యాశాఖాధికారి కె.రాంబాబు సూచించారు. గురువారం మండల విద్యాశాఖ కార్యాలయంలో సిఆర్‌పిలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడి బయట పిల్లలు ఎవరూ లేకుండా చేయాలని, పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెంచే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలల పరిసరాల వాతావరణం పరిశుభ్రంగా ఉంచేలా చేపట్టి, విద్యార్థులు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలన్నారు. విద్యార్థులు వ్యక్తిగత శుభ్రత పాటించేలా అవగాహన కల్పించాలన్నారు. ప్రతిరోజూ పిల్లలు బడికి వచ్చేలా చర్యలు చేపట్టాలని, ఎవరికైనా ఆరోగ్యం బాగోకపోతే వెంటనే ఆసుపత్రిలో చికిత్స చేసేలా చూడాలన్నారు. సమావేశంలో ఎంఆర్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.





జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం





## అధికారులు అప్రమత్తంగా ఉండండి

**కంచిలి, జులై 18(వార్త):** గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు కంచిలి మండలంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా పంచాయతీ విస్తరణాధికారి ఐవీ రమణ కోరారు. గురువారం కంచిలి మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్య నివారణకు చర్యలు చేపట్టాలని, బావులు క్లోరినేషన్ చేయాలని, నీరు నిల్వ లేకుండా చూడాలని, దోమలు రాకుండా స్ప్రే చేయాలని కోరారు. పంచాయతీ నిధులు పక్కదారి పట్టకుండా నిధులన్నీ సద్వినియోగపరుచుకోవాలని కోరారు. సమావేశంలో ఈఓఆర్డి రాంబాబు పాల్గొన్నారు.

# నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తా

### ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఈశ్వరరావు



**శ్రీకాకుళం టౌన్, జులై 18 (వార్త):** జిల్లాతో పాటు ఎచ్చెర్ల నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. స్టార్ వాకర్స్ క్లబ్ పూర్వ అధ్యక్షుడు, వ్యాపారవేత్త ఊణ్ణ కామేశ్వరరావు ఆధ్వర్యంలో స్థానిక బ్లూఎర్త్ హోటల్లో బుధవారం రాత్రి నిర్వహించిన అభినందన సభలో ఆయన మాట్లాడారు. విద్యార్థి దశ నుంచి ఎన్నో సమస్యలపై పోరాడుతూ వచ్చానని, ఉన్నత చదువులు పూర్తి చేసి దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఉద్యోగ బాధ్యతలు నిర్వహించినా ప్రజలకు సేవ చేయాలనే తపనతో నడికుదిటిపాలెం చేరుకున్నానన్నారు. గత 12 ఏళ్లుగా తాను ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ స్థానిక సంస్థల రాజకీయాల్లో పనిచేస్తూ వచ్చానన్నారు. ఇదే సమయంలో తాను, తన అనుయాయులు ఎన్నో కేసులు ఎదుర్కోవాల్సి వచ్చినా వీటన్నింటిపైనా పోరాటం సాగిస్తూ ఎమ్మెల్యే స్థాయికి చేరుకోగలిగానన్నారు. ఎమ్మెల్యే కావడంతో లక్ష్యం నెరవేరినట్టు కాదని, ఎచ్చెర్ల నియోజకవర్గాన్ని అభివృద్ధి పథం వైపు నడిపించడమే ధ్యేయంగా పనిచేస్తానని స్పష్టం చేశారు. గతంలో తాము ఎవరి వల్ల ఇబ్బందులకు గురయ్యామో వారికి ఇబ్బంది పెట్టే ఆలోచన తనకు గాని, తన అనుచరులకు గాని లేదని, మరిన్ని సేవలను విస్తరించడం ద్వారా ప్రజల మన్ననలు పొందడమే లక్ష్యమన్నారు. డిఐపి ఆర్వో కె.చెన్నకేశవరావు మాట్లాడుతూ సంఘ సేవకుడిగా ప్రజలకు పరిచయమైన ఈశ్వరరావు రాజకీయాల్లోనూ అదే స్థాయిలో ఎదగడం అభినందనీయమన్నారు. ఏపిడబ్ల్యుజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కొంక్యాన వేణుగోపాల్ మాట్లాడుతూ విద్యా సంస్థల అధినేతగా, సంఘ సేవకునిగా స్థానిక సంస్థల ప్రతినిధిగా విజయవంతంగా అడుగులు వేసి జిల్లాలో బిజెపి తరపున తొలి శాసనసభ్యుడిగా ఈశ్వరరావు ఎన్నిక కావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన స్టార్ వాకర్స్ పూర్వ అధ్యక్షుడు, ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.జోగినాయుడు మాట్లాడుతూ చదువులో, ఉద్యోగంలో రాణించడమే కాకుండా సామాజిక సేవా కార్యక్రమాల్లో మంచి పేరు సంపాదించిన ఈశ్వరరావు ఎమ్మెల్యే కావడం అభినందనీయమన్నారు. వాకర్స్ ఇంటర్నేషనల్ పూర్వ అధ్యక్షుడు చెలికాని సీతారామయ్య, వాకర్స్ మాజీ గవర్నర్ జి.ఇందిరాప్రసాద్ ప్రతినిధులు బి.వి.రవిశంకర్, ఊణ్ణ కామేశ్వరరావు, ఉద్యానశాఖ ఏడీ రత్నాల వరప్రసాద్ ఎన్ఎస్ఈఆర్ సేవలను ప్రశంసించారు. ప్రముఖ గజల్ నాయకుడు డాక్టర్ మంతిన వాసుదేవాచారి పలు గజల్స్ ఆలపించి ఆహుతులను అలరించారు. కార్యక్రమంలో వాకర్స్ ఫౌండేషన్ ట్రస్టీలు శీలం ఇసాక్, అభిమన్య నాయక్, పూర్వ గవర్నర్లు వెంకటరమణమూర్తి, పి.జి. గుప్తా, యోగా మహిళా కన్వీనర్ తంగి స్వాతి, దేవీప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

### విద్యతోనే విద్యార్థుల ప్రగతి

ప్రతి విద్యార్థి తరగతులకు క్రమం తప్పకుండా హాజరు కావాలని, బాగా చదువుకోవాలని ఎచ్చెర్ల శాసన సభ్యులు ఎన్.ఈశ్వరరావు అన్నారు. గురువారం ఎచ్చెర్ల ఐఐఐటిలో పీయూసీ పూర్తి చేసిన విద్యార్థులకు నియామక పత్రాలను అందజేశారు. రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం ఐఐఐటి డైరెక్టర్ ప్రొఫెసర్ కొక్కిరాల వెంకట గోపాల ధనబాలాజీ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. విద్య తోనే మనం భవిష్యత్తు లక్ష్యాలను సాధించుకోగలమని, తద్వారా సమాజంలో ఉన్నతమైన స్థానంలో విద్యార్థులు నిలిచేందుకు దోహదపడుతుందన్నారు. చదువు అభివృద్ధికి సూచికమని సమాజంలో ఏ ప్రాంతానికి వెళ్లిన వారి అభిప్రాయాలను, భావాలను అర్థం చేసుకొని వ్యక్తిగత ఎదుగుదలకు చదువు ఎంతో తోడ్పాటునిస్తుందన్నారు. ఇంజనీరింగ్ మొదటి 1 నుండి 5 ర్యాంక్‌లు పొం దిన వారికి అభినందించారు. కార్యక్రమంలో పరి పాలన అధికారి ముని రామకృష్ణ, డీన్ మోహన్ కృష్ణ చౌదరి, డీన్ వెల్ఫేర్ రవి, కౌన్సెలింగ్ కోఆర్డి నేటర్లు రమణ, రమేష్, తదితరులు పాల్గొన్నారు.






## హెల్మెట్ వినియోగంపై అవగాహన ర్యాలీ

**శ్రీకాకుళం లీగల్, జులై 18(వార్త):** హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పిస్తూ గురువారం శ్రీకాకుళం నగరంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ జిల్లా కోర్టు నుంచి డే అండ్ నైట్ కూడలి వరకు సాగింది. డే అండ్ నైట్ కూడలి వద్ద వాహన దారులతో హెల్మెట్ వాడకం వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సంతదర్భగా పలువురు మాట్లాడుతూ ద్విచక్రవాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాదాల నుంచి తప్పించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు, న్యాయవాదులు, పోలీసు అధికారులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## 20న సిక్కోలులో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ పర్యటన

**శ్రీకాకుళం టౌన్, జులై 18(వార్త):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, సభ్యుడు గొండు సీతారాం ఈనెల 20న శ్రీకాకుళంలో పర్యటించనున్నారు. ఆరోజు ఉదయం11 గంటలకు జిల్లా కలెక్టర్ సారధ్యంలో కలెక్టరేట్ సమావేశ మందిరంలో పిల్లలకు మాదక ద్రవ్యాల నియంత్రణలో ప్రభుత్వ శాఖల పాత్రపై సమీక్ష సమావేశంలో పాల్గొనున్నారు. మధ్యాహ్నం ప్రభుత్వ, గిరిజన సంక్షేమ వసతి గృహాలను, కార్పొరేట్, ప్రభుత్వ పాఠశాలలు, ఇంటర్మీడియట్ కళాశాలలు సందర్శించనున్నారు.

## ఆర్టీసీ డ్రైవింగ్ స్కూల్ 17వ బ్యాచ్‌కు దరఖాస్తులు ఆహ్వానం

**శ్రీకాకుళం టౌన్, జులై 18(వార్త):** ఏపీఎస్ఆర్టీసీ హెవీ డ్రైవింగ్ స్కూల్‌లో 17వ బ్యాచ్ హెవీ డ్రైవింగ్ శిక్షణ కు గాను లైట్ మోటార్ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ కలిగినటువంటి వారు దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా ప్రజా రవాణా అధికారి విజయ్ కుమార్ అన్నారు. ఆగస్టులో ప్రారంభమయ్యే 17వ బ్యాచ్‌లో 16 మందికే అవకాశం ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఫీజు, ఇతర వివరాలకు 9963091999, 7382923293 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

## నేడు జిల్లాకు కేంద్ర మంత్రి రాక

**శ్రీకాకుళం టౌన్, జులై 18 (వార్త):** కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు శుక్రవారం జిల్లాలో పర్యటిస్తారని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.40 గంటలకు ఇచ్ఛాపురం చేరుకొని స్వేచ్ఛావతి అమ్మవారిని దర్శించుకుని, మున్సిపల్ కార్యాలయంలో 10.30 గంటలకు వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహిస్తారని చెప్పారు. మధ్యాహ్నం 12.30గంటలకు కవిటి మండలంలోని రామయ్య పుట్టుగ చేరుకుని, స్థానికులను కలుసుకుని మధ్యాహ్న భోజనం అనంతరం అక్కడి నుంచి టెక్కలి జూనియర్ కళాశాల మైదానానికి సాయంత్రం 4 గంటలకు చేరుకుని ర్యాలీలో పాల్గొంటారని, అనంతరం రాత్రి 9 గంటలకు శ్రీకాకుళం నగరంలోని తన నివాసానికి చేరుకుంటారని తెలిపారు.

## బాలుడిపై కుక్క దాడి

**ఆమదాలవలస, జులై 18(వార్త):** చిన్నజొన్నవలస నిర్వాసిత కాలనీకి చెందిన 11 ఏళ్ల బాలుడు చల్లా సతీష్ సైకిల్‌పై గురువారం వెళుతుండగా కుక్క దాడి చేసింది. ఆ బాలుడు కేకలు వేయడంతో తల్లిదండ్రులు వచ్చి కుక్కను తరిమేశారు. వెంటనే బాలుడిని ఆమదాలవలస ఆసుపత్రికి తరలించారు. కుక్క యజమాని అచ్యుతరావు తన కుమారుడిపై కుక్కను ఉసిగొల్పాడని ఆ బాలుడి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నామని ఎస్ఐ వెంకటేష్ తెలిపారు.

# సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

* వరద ప్రభావిత ప్రాంతాల్లో ముందు జాగ్రత్త చర్యలు
* వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్

**శ్రీకాకుళం, జులై18(వార్త):** సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్లతో ఆయన సీజనల్ వ్యాధులు, తాగునీరు, భారీ వర్షాలపై ఆయన వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో తాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు. తాగునీటి పైపులు లీకేజీ లేకుండా చూడాలని, వీధుల్లో చెత్త లేకుండా ఆదేశించారు. సెప్టిక్ ట్యాంక్ పైపులకు నైలాన్ జాలి అమర్చాలని, జాలి అందుబాటులో లేని యెడల పలుచని క్లాత్‌ని అమర్చి దోమలు నివారించవచ్చన్నారు. కాలువల్లో పూడికలగించి నీరు నిల్వ లేకుండా చూడాలని చెప్పారు. ప్రతీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఔషధాలు అందుబాటులో ఉండే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కంట్రోల్ రూంలు ఏర్పాటు చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం. నవీన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం. గణపతి రావు, జడ్పీ సీఈవో వెంకటేశ్వరరావు, సిపిఓ లక్ష్మీ ప్రసన్న, ఇరిగేషన్ ఎస్ఈ సుధాకర్, డిపిఓ వెంకటేశ్వరరావు, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చల్లా ఓబులేసు, డిఎంహెచ్ఓ డాక్టర్ బి మీనాక్షి, డిఎంఓ సత్యనారాయణ, డిసిహెచ్ఓ రాజ్యలక్ష్మి, ఆర్టీఓ గంగాధర్, డిజాస్టర్ మేనేజ్ మెంట్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ పి.రాము పాల్గొన్నారు.





# రెడ్‌క్రాస్ సేవలు వెలకట్టలేనిది

* జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్
* ఘనంగా రెడ్ క్రాస్ వార్షిక సర్వసభ్య సమావేశం

**శ్రీకాకుళం, జులై 18 (వార్త):** ఉత్తమ విలువలు, వెలకట్ట లేని సేవలతో శ్రీకాకుళం రెడ్ క్రాస్ జాతీయస్థాయిలో పేరు ప్రఖ్యాతులు సాధించిందని జాయింట్ కలెక్టర్ ఎం. నవీన్ అన్నారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, శ్రీకాకుళం జిల్లా శాఖ సర్వ సభ్య సమావేశం స్థానిక బాపూజీ కళా మందిర్‌లో గురువారం ఘనంగా జరిగింది. రెడ్ క్రాస్ వ్యవస్థాపకులు హెన్రీ దునాంట్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన అనంతరం వార్షిక నివేదికను రెడ్ క్రాస్ చైర్మన్ పి.జగన్ మోహన రావు, సెక్రటరీ బి.మల్లేశ్వర రావు, ఇతర కమిటీ సభ్యులుతో కలసి విడుదల చేశారు. తొలుత ఫోటో ఎగ్జిబిషన్ ను జెసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ నవీన్ మాట్లాడుతూ రెడ్ క్రాస్ లాంటి వ్యవస్థ జిల్లాలో ఒక మహోన్నత శక్తిగా ఎదిగిందని కొనియాడారు. బ్లడ్ డొనేషన్ క్యాంపులను నిర్వహించి, ప్రాణాపాయ స్థితిలో వ్యక్తులకు రక్తాన్ని, సింగల్ డోనర్ ప్లేటిలెట్స్, కళ్యాణ్ మగటపల్లి నేత్ర స్వీకరణ కేంద్రం నుండి నేత్రాలను సేకరించి విశాఖపట్నం మోహిన్ నేత్ర నిధికి అందించటం, రెడ్ క్రాస్ ఉచిత వైద్య కేంద్రం, మెడిసన్ బ్యాంకు స్థాపించి, ప్రజా ఆరోగ్య పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఉచితంగా మందులను అందించటం, ఉచిత అంబులెన్సు సర్వీస్, పర్యావరణ సంరక్షణకు మొక్కలు నాటడం, నాటించటం, శాంతా అనురాగ నిలయం, సివి.నాగజ్యోతి ఆనందనిలయం ద్వారా పేదలకు అండగా నిలవటం లాంటి ఎన్నో సేవలకు రెడ్ క్రాస్ ఆదర్శప్రాయంగా నిలుస్తుందన్నారు. ప్రకృతి వైపరీత్యాలలో ముఖ్యంగా కరోనా మహమ్మారి విజృంభణ కాలంలో రెడ్ క్రాస్ సేవలు అమూల్యమని, పేదలు, అనాధల అంత్యక్రియలు నిర్వహించటం ఇలా ఎన్నో సేవలకు చిరునామాగా ఇండియన్ రెడ్ క్రాస్ ముందుంటుందన్నారు. ఈ సందర్భంగా రక్తదానం, ఎస్డీపీ పై అవగాహన కల్పిస్తున్న మోటివేటర్ లను, నేత్ర దానం చేసిన దాత కుటుంబసభ్యులను, ఏభైకి పైగా రక్త నిల్వలను అందించిన ప్రతీ ఒక్కరికీ శ్రీకాకుళం జాయింట్ కలెక్టర్ మల్లారపు నవీన్ చేతుల మీదుగా జ్ఞాపికను, ప్రశంసా పత్రాలను అందించి, దుస్సాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో శాసన సభ్యురాలు గౌతు శిరీష, ఎమ్మెల్యే కూన రవికుమార్ సతీమణి కూన ప్రమీల, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కే చెన్నకేశవరావు, పి రజిని కాంతారావు, పి.శ్రీకాంత్, పెంకి చైతన్య, అవార్డు గ్రహీతలైన పలు విద్యాసంస్థల ప్రతినిధులు, సామాజిక వేత్తలు, వివిధ పరిశ్రమలు, ఆసుపత్రుల యాజమాన్యాల ప్రతినిధులు పాల్గొన్నారు.




Printed and published on behalf of CHOWDARI and printed at RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam. srikakulam dist. ANDHRAPRADESH STATE 532001 published at RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam dist ANDHRAPRADESH STATE 532001 Editor: Chowdari Pramod E-mail:jatheeyavaartha @gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:016413